
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 5 మే 2025



నిర్మించారు.. వదిలేశారు..!

- అసంపూర్తి పనులతో ఆరోగ్య భవనం
- నిరుపయోగంగా చేపల మార్కెట్
- ఉపయోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు

6





ఈత సరదా

కందిలోని కొత్తకందిలో ఉన్న పెద్దబావిలో పిల్లలు, యువకులు సరదాగా ఈత కొడుతున్నారు. దాదాపు 120 ఫీట్లలోతు ఉన్న పెద్దబావి వద్ద ఆదివారం 12 నుంచి 15 ఏళ్లలోపు వారితో సందడిగా కనిపించింది. ఖాళీ ఐదు లీటర్ల వాటర్ బాటిళ్లను వీపుకు కట్టుకుని ఈత నేర్చుకోవడం కనిపించింది. అయితే, ఈత వచ్చిన పెద్దవాళ్లు అక్కడ కనిపించలేదు. ఏదైనా జరగరానిది జరిగితే సరదా కాస్త శోకంగా మారుతుంది. తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుని పెద్దబావి వద్దకు ఈతకు పంపించడం మేలు.

- కంది, మే 4 (ఆంధ్రజ్యోతి)

మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్‌లో 20 బాత్రూమ్‌ల ఏర్పాటు

రూ.15 లక్షల సొంత నిధులతో నిర్మాణానికి జగ్గారెడ్డి నిర్ణయం

సంగారెడ్డి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన సొంత నిధులు రూ.15 లక్షలతో 20 బాత్రూమ్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులు తక్షణమే ప్రారంభించాలని ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆదివారం మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌ను జగ్గారెడ్డి సందర్శించారు. ఈ మేరకు హాస్టల్‌లో 150 మంది విద్యార్థినులకు కేవలం పది బాత్రూమ్‌లు మాత్రమే ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ సిబ్బంది జగ్గారెడ్డికి వివరించారు. ఇందుకు వెంటనే స్పందించిన జగ్గారెడ్డి తన సొంత నిధులు రూ.15 లక్షలతో 20 బాత్రూమ్‌లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ సెలవుల అనంతరం తిరిగి హాస్టల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తక్షణమే పనులు ప్రారంభించాలని ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో ఇప్పుడున్న బాత్రూమ్‌లకు అదనంగా మరో ఇరువై బాత్రూమ్‌లు ఏర్పాటు చేయడం పట్ల హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్‌తోపాటు ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ డీఈ రాజు, ఏఈలు రాజమల్లయ్య, లక్ష్మీకాంత్ ఉన్నారు.





సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థినుల కోసం నిర్మించ తలపెట్టిన బాత్రూమ్‌ల స్థలాన్ని పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

హాస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న జగ్గారెడ్డి

బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్‌పై ఇక రయ్ రయ్

- నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ



బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్

రామచంద్రాపురం టౌన్ మే 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లాకు వచ్చే మార్గంలో లింగంపల్లి కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ దాటాలంటే అరగంటకుపైగా సమయం పట్టేది. ఈదారిలో నిత్యం ప్రయాణించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నరక యాతన పడేవారు. కొత్తగా నిర్మించిన బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్‌తో ఇక ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది. రామచంద్రాపురం అశోక్‌నగర్ నుంచి లింగంపల్లి దాటే వరకు 1.6 కిలోమీటర్ల మేర 172 కోట్ల వ్యయంతో నిర్మించిన బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్‌ను సోమవారం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ ప్రారంభించనున్నారు. హెలీకాప్టర్ ద్వారా రానున్న కేంద్రమంత్రి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇక్రిశాట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగనున్నారు. అక్కడి నుంచి నేరుగా సభాస్థలికి చేరుకుంటారు. రామచంద్రాపురం అశోక్‌నగర్ నుంచి వంతెనపైకి వెళుతున్న మార్గంలో ఒకవైపు పూజ చేయడానికి ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని ఉన్నతస్థాయి అధికారులు పర్యవేక్షణ జరుపుతారు. పూజ జరిగిన తరువాత రిబ్బన్ కట్ చేసి వాహనంలో ప్రయాణం చేస్తూ వంతెన నిర్మాణం పరిశీలించి అలానే కిందిభాగంలో నిర్మించిన జాతీయ రహదారిని చూస్తారు. అనంతరం తిరిగి ఇక్రిశాట్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో తిరుగుప్రయాణమవుతారు.

ఓవర్‌లోడ్ లారీ
కార్లపై బోల్తా

నుజ్జునుజ్జయిన రెండు వాహనాలు

ఇద్దరికి గాయాలు

7

గలగలా పారుతూ మంజీరా నదివైపు ప్రవహిస్తున్న నక్కవాగును ఇసుకాసురులు ఛిద్రం చేస్తున్నారు. అందమైన వాగును అధ్వానంగా మార్చి విధ్వంసం సృష్టిస్తున్నారు. వాగులోని మట్టిని జల్లెడ పట్టి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా జరిగే ఈ అక్రమ దందాపై హెచ్చరికలు చేసినా, దాడులు చేపట్టినా, ఎక్కడికక్కడ కూల్చివేసినా.. మళ్లీ నక్కవాగును పీల్చకుండా ఇసుకాసురులు నిద్రపోవడం లేదు.



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో మట్టిని నీటితో కడగడంతో తయారైన ఇసుక



బ్యాతోలు శివారులో గుంతలమయంగా నక్కవాగు

నక్కవాగును పీల్చేస్తున్నారు

- అడుగడుగునా మట్టిని జల్లెడ పట్టే ఫిల్టర్లు
- నామరూపాల్లేకుండా చేస్తున్న ఇసుకాసురులు
- కూల్చిన కొద్దీ వెలుస్తున్న ఫిల్టర్ స్థావరాలు
- దాడులు జరిగిన గంటల్లోనే మళ్లీ ప్రారంభం
- నిత్యం రూ.2 కోట్ల అక్రమ ఇసుక వ్యాపారం
- అక్రమార్కుల వెనుక నేతలు, అధికారులు
- కలెక్టర్, ఎస్పీ దృష్టి సారిస్తేనే కట్టడి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 4 : సంగారెడ్డి, కంది మండలాల్లో ప్రవహిస్తున్న నక్కవాగు పరిసర గ్రామాలైన ఇస్మాయిల్‌ఖాన్ పేట, దాసుగడ్డ తండా, హనుమాన్‌నగర్, అరుట్ల, ఎర్దనూరు, బ్యాతోలు, చిద్రుప్ప గ్రామాల్లో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. సహజసిద్ధంగా కాకుండా నీటితో మట్టిని కడిగి కృత్రిమంగా నాసిరకం ఇసుకను సిద్ధం చేసి బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇది నాసిరకం ఇసుక అయినప్పటికీ గోదావరి, మానేరు ఇసుకగా ప్రచారం చేస్తూ టన్నుకు రూ.1200 నుంచి రూ.2వేల దాకా విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.



కంది మండలం బ్యాతోలులో ఫిల్టర్ ఇసుకను తయారు చేసే స్థావరం

రాజకీయంగా అండదండలు పొందుతూ, పలు శాఖల్లో కీలక అధికారులను మచ్చిక చేసుకుంటూ దర్జాగా అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

నిత్యం కోట్లలో వ్యాపారం

ప్రకృతి సిద్ధమైన నక్కవాగును తోడేళ్ల వలె తోడుతూ నిత్యం కోట్లలో అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్నారు. సంగారెడ్డితోపాటు హైదరాబాద్, బీదర్, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాలకు ప్రతీరోజు వందల సంఖ్యలో ఫిల్టర్ ఇసుక లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. గడిచిన 20 రోజుల్లోనే ఆరుసార్లు ఈ ఇసుక లారీలు పట్టుబడడం గమనార్హం. ఒక్కో లారీకి దూరం ఆధారంగా రూ.30వేల నుంచి రూ.50వేల ఆదాయం వస్తున్నది. ఈ లెక్కన నిత్యం కోట్ల రూపాయల్లోనే వీరి వ్యాపారం బహిరంగంగానే సాగుతోంది. ఇందులో అండగా ఉంటున్న రాజకీయ నేతలకు, రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఆర్టీఏ, నీటిపారుదల శాఖల్లోని పలువురు అధికారులకు వాటాలు పంచుతున్నందునే వీరి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా నడుస్తోందనే చర్చ జరుగుతోంది.

నామరూపాల్లేని నక్కవాగు

ఓవైపు జల వనరులు, పచ్చని చెట్లను సంరక్షించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటుంటే.. ఇక్కడ మాత్రం ఇసుక వ్యాపారులు నక్కవాగును నామరూపాల్లేకుండా చేస్తున్నారు. ప్రధానంగా కంది మండలం బ్యాతోల్, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట వద్ద నక్కవాగు పరిస్థితిని చూస్తే ముక్కున వేలేసుకునే పరిస్థితి కనిపిస్తుంది. ఎక్కడికక్కడ వాగును

మిగతా 8వ పేజీలో

ప్రశాంతంగా 'నీట్'

సంగారెడ్డి క్రైం/మెదక్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసంది. సంగారెడ్డి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 3,320 మంది అభ్యర్థులకు, 3,222 మంది హాజరయ్యారు. 97.04 హాజరుశాతం నమోదైంది. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 487 మంది అభ్యర్థులకు 17 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 96.50 హాజరు శాతం నమోదైంది. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతించగా, ప్రతీ విద్యార్థి నుంచి రెండు పాస్‌సైజ్ ఫొటోలను తీసుకొని, ఒరిజినల్ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అభ్యర్థులను లోనికి పంపించారు. సంగారెడ్డిలో పలు పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరితోశ్ పంకజ్ సందర్శించారు.



సంగారెడ్డిలోని పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

'భూ భారతి' పైలెట్ మండలంగా చిలప్‌చెడ్

- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

నర్సాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భూభారతి పోర్టల్‌కు సంబంధించి రెవెన్యూ సదస్సుల కోసం నర్సాపూర్ డివిజన్‌లో చిలప్‌చెడ్ మండలాన్నిను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచీ 14వరకు ఉదయం 9 గంటల నుంచీ సాయంత్రం 4 గంటల వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇద్దరు తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేడు రహీమ్‌గూడ, రాందాస్‌గూడ, దాసుగడ్డ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నారు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, విచారించి పరిష్కరిస్తారన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం, బలగం

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం : మంత్రి దామోదర్ రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో ఆదివారం డీసీసీ ప్రెసిడెంట్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలను సైతం పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తెలంగాణలో చేపట్టిన బీసీ కులగణనను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేలా కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. బీసీ రిజర్వేషన్లతో పాటు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అనేక హామీలను ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. కష్టపడ్డ కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని కార్యకర్తలకు భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశానికి జహీరాబాద్ ఎంపీ సురేష్‌శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు, జిల్లా అబ్జర్వర్లు రాంమోహన్‌రెడ్డి, దయాకర్, జహీరాబాద్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు గిరిధర్‌రెడ్డి, శివసేనరెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి తదితరులు హాజరయ్యారు. అయితే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీలు నామమాత్రంగా ఉన్నాయని పటాన్‌చెరు నియోజవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కార్యకర్తలు వేదిక వద్దకు దూసుకెళ్లగా, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎంపీ సురేష్‌శెట్కార్ సముదాయించారు.

చర్చలకు పిలుస్తారా.. సమ్మెకు దిగమంటారా.?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ జేఏసీ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిస్తే వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, చర్చలకు పిలుస్తారా లేక సమ్మెకు దిగమంటారా అని ఆర్టీసీ జేఏసీ నాయకుడు పల్లె కృష్ణమూర్తి ప్రశ్నించారు. సంగారెడ్డిలోని విద్యుత్ ఉద్యోగుల యూనియన్ భవన్‌లో ఆదివారం ఆర్టీసీ సమ్మె సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2017 పీఆర్సీ బకాయిలు, డీఏ ఏరియర్స్ అన్ని కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఎన్ని రోజులుగా ఎదురుచూసినా ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన రావడం లేదని మండిపడ్డారు. ఆర్టీసీ జేఏసీ నాయకులతో చర్చలు జరపాలని, లేని పక్షంలో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ వెంకన్న, రాష్ట్ర కో చైర్మన్‌లు థామస్‌రెడ్డి, హనుమంతు, సురేష్, జేఏసి నాయకులు సత్తయ్య, జీవీఎస్.రావు, శ్రీనన్న, పీకే మూర్తి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం నెలకొన్నది. అటు భానుడు తన తాపాన్ని తీర్చుకోగా.. ఇటు వరుణుడు ప్రతాపాన్ని చూపిస్తుంచాడు. మధ్యాహ్నం వరకు భానుడు భగ్గుమంటుంటే.. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడగా, అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది.

సూర్య తాపం.. వరుణుడి ప్రతాపం

ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం

కోహీర్/రామాయంపేట/నిజాంపేట/అల్లాదుర్గం/చేగుంట/శివ్వంపేట/జిన్నారం/హత్నూర/రామచంద్రాపురం/నారాయణఖేడ్, మే 4 : ఉమ్మడి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండలకు నింపులకుంపటిలా ఉండగా, సాయంత్రం చల్లబడింది. ఉదయం 9 నుంచి భానుడి భగభగలు మొదలవగా, మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతం కావడంతో సూర్యుడు మబ్బులచాటుకు వెళ్లాడు. ఉమ్మడి జిల్లాలో ఆదివారం 108 ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని చిట్యాలలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లాలోని శంకరంపేట(ఏ)లో 43.4 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన నిజాంపేట్‌లో 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు నిప్పులుకురిపించిన ఎండలు, ఆ తర్వాత మబ్బులు పట్టడంతో వాతావరణం చల్లబడింది. పలుచోట్ల సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై తేలికపాటి చినుకులు కురియగా, మరికొన్ని చోట్ల ఈదురుగాలులు వీచాయి. ఇంకొన్ని చోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది.



రామాయంపేటలో నీటిపాలైన ధాన్యం

రాళ్ల వాన

మెదక్ జిల్లాలోని రామాయంపేట, నిజాంపేట, చేగుంట, శివ్వంపేట, అల్లాదుర్గం మండలాల్లో, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, రామచంద్రాపురం, హత్నూర మండలాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల రాళ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. కొన్నిచోట్ల వడ్లపై కప్పిన టార్పాలిన్లు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. రామాయంపేటలోని మార్కెట్ కమిటీ ఆవరణలో టార్పలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో ధాన్యం నీటి పాలైందని రైతులు నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. మరికొన్ని చోట్ల చేలల్లో వడ్లు నేలరాలాయి. చేగుంట మండలంలోని చందాయిపేట గ్రామానికి చెందిన అచ్చంపేట యాదగిరికి చెందిన ఏడెకరాల వరి పొలంలో వడ్లు నేలరాలాయి. చేగుంట మండలంలోని మక్కరాజపేట్, గొల్లపల్లి, కసాన్పల్లి, రాంపూర్, కర్నాల్‌పల్లి, చందాయిపేట్, పోతన్‌పల్లి గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. హత్నూర మండలం సిరిపురం, అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో



జిన్నారం మండలం వావిలాలలో కురుస్తున్న వడగండ్ల వాన

మిగతా 8వ పేజీలో

టీఎంవోప రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగదీశ్వర్


దాస జగదీశ్వర్

ములుగు, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీ సేవా ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిద్దిపేట జిల్లా ములుగుకు చెందిన దాస జగదీశ్వర్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన ప్రసాద్ జగదీశ్వర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ మీసేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక హక్కులను సాధించుకుందాం

- 20న సమ్మె కేంద్రంపై యుద్ధమే
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

రామాయంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కార్మికుల హక్కులను సాధించుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. అందుకోసం ఈ నెల 20న సార్వత్రిక సమ్మెతో యుద్ధభేరి మోగిద్దామని పిలుపునిచ్చారు. రామయంపేటలో ఆదివారం సీఐటీయూ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అడ్డగోలుగా జీఎస్టీ రుద్దుతూ సామాన్యులపై ధరల భారం మోపుతోందని విమర్శించారు. ఓవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించడం లేదన్నారు. ప్రజల అనారోగ్యం వంకతో బీడీలపై ఉక్కుపాదం మోపిన కేంద్రం అదే మద్యాన్ని ఎందుకు ప్రోత్సహిస్తుందని ప్రశ్నించారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, బాలమణి మల్లేశం, అన్నపూర్ణ, మహేందర్ రెడ్డి, నాగరాజు, యశోద యశోద పాల్గొన్నారు. కాగా, మహాసభల సందర్భంగా కార్మికుల మెగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత హైవేపై భారీ ఎర్రజెండాలతో కార్మికులు కదం తొక్కడంతో అ ప్రాంతమంతా ఎరుపెక్కింది.


మాట్లాడుతున్న చుక్క రాములు



అగ్రహారంలో ఉద్రిక్తత

- నవవధువు ఆత్మహత్యతో బంధువుల ఆందోళన
- పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు


ఆందోళన చేస్తున్న బంధువులు


పూజ(ఫైల్)

చిన్నశంకరంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి నవవధువు వట్టెం పూజ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆదివారం మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పూజ మృతికి అత్తింటివారే కారణమని వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామానికి చెందిన ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఇంటి నుంచి మృతదేహాన్ని బయటకు తీయకుండా అడ్డుకున్నారు. దీంతో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ మన్నన్, రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, క్లూస్ టీమ్‌తో కలిసి శవ పంచనామా నిర్వహించారు. మృతురాలి కుటుంబీకులకు న్యాయం జరిగేంతవరకు ఊరుకోబోమని పోలీసులపై తిరగబడడంతో డీఎస్పీ నచ్చజెప్పి శాంతింపజేశారు. గ్రామంలో భారీ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. అదనపు కట్నం వేధింపులు భరించలేక పూజ ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి గంధం సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య మృతురాలి అంత్యక్రియలు పూర్తి చేశారు.

E-Mail: hsfcc41@gmail.com
Website: www.tsfcc1941.com
Phone : 040-23552830
Mobile: 96408 55520

TELANGANA STATE FILM CHAMBER OF COMMERCE™
(The Hyderabad State Film Chamber of Commerce)
(Nizam Circuit)
Plot No. 42-C, 3rd Floor, Road No.11, Beside Sai Baba Temple, Film Nagar, Jubilee Hills, Hyderabad-500 096, T.S.
(Recognised By Govt. of T.S.)

2025-27 సంవత్సరాలకు (2 సంవత్సరాలు) సాధారణ ఎన్నికలు మరియు 80వ వార్షిక సర్వసభ్య సమావేశం ఛాంబర్ ఆవరణ వద్ద 07 జూన్ 2025 (శనివారం) నిర్వహించబడుతుందని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ది హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) యొక్క సభ్యులకు తెలియచేయడమైనది.

ఆఫీస్ బేరర్ లేదా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఏదైనా పోస్టుకు అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఎవరైనా సభ్యుడు అతని/ఆమె నామినేషన్ దాఖలు చేయుటకు ముందే అన్ని బకాయిలను ఏవైనా ఉంటే చెల్లించాలి.

ఎలక్షన్ క్యాలెండర్

1	ఆఫీస్ బేరర్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నికల కొరకు నామినేషన్ల స్వీకరణ	14.05.2025 ఉ.10.00 గం.నుండి
2	ఆఫీస్ బేరర్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నికల కొరకు నామినేషన్ల స్వీకరణకు ఆఖరి తేది	24.05.2025 మ.3.00 గం.వరకు
3	చెల్లుబాటు గల నామినేషన్ల పరిశీలన మరియు ప్రకటన	24.05.2025 సా.4.00 గం.కు
4	ఉప సంహరణలకు అనుమతి	27.05.2025 మ.3.00 గం.లోగా
5	ఆథరైజేషన్ లెటర్ దాఖలు చేయుట	05.06.2025 సా.5.00 గం.నుండి
6	2025-2027 సంవత్సరాలకు ఎన్నికలు (ఓటింగ్)	07.06.2025 ఉ.10.00 గం.నుండి మ.2.00 గం.మధ్య
7	80వ వార్షిక సర్వ సభ్య సమావేశం	07.06.2025 సా.4.00 గం.కు

నామినేషన్ పత్రాలు, ఓటర్ల జాబితా ఛాంబర్‌లో లభిస్తాయని గమనించగలరు. మరిన్ని వివరాలకు సంప్రదించండి. ఛాంబర్ మొబైల్: 9640855520.

సం/-కె.దుర్గా ప్రసాద్, ఎన్నికల అధికారి

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

దుబ్బాక, మే4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని పోలీసులు అడ్డుకున్న ఘటన దుబ్బాక మండలంలోని ఆకారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన బాలికకు ఆకారం గ్రామానికి చెందిన యువకుడితో ఆదివారం వివాహం జరిపించేందుకు సర్వం సిద్ధం చేశారు. మైనర్ కావడంతో వివాహం చేయవద్దని కామారెడ్డి జిల్లా అధికారులు పలుసార్లు సూచించినా వారు పట్టించుకోలేదు. వరుడి ఇంటి వద్ద ఆదివారం 10.05 గంటలకు వివాహం జరిపేందుకు నిర్ణయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని పెళ్లిని నిలిపివేయించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఇరుకుటుంబాలను కౌన్సెలింగ్ నిర్వహించి వధువును సొంతూరుకు పంపించారు. అక్కడి అధికారులతో; మాట్లాడి నిఘా ఉంచాల్సిందిగా సూచించారు.

లక్ష్యసాధనకు మహర్షి భగీరథుడే స్ఫూర్తి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడే స్ఫూర్తి అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన సంక్షేమ శాఖ అధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

హవేళిఘణపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) :మండలం పరిధి కూచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రయించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు


చెస్ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

మెదక్ అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-7, అండర్-11 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-11 బాలుర విభాగంలో ప్రథమ హర్షిత్(మెదక్), ద్వితీయ రిత్విక్(సంగారెడ్డి), తృతీయ శ్రీమాన్‌రావు(సిద్దిపేట), నాలుగో బహుమతి ఇషాన్(మెదక్), బాలికల విభాగంలో ప్రథమ జశ్వంతిక, ద్వితీయ మేఘవర్షిక(మెదక్), అండర్-7 బాలుర విభాగంలో ప్రథమ శ్రీరామ్(సంగారెడ్డి) ద్వితీయ రితీష్(సంగారెడ్డి) స్థానాలను గెలుపొందారు. ఈ పోటీలోని విజేతలు హైదరాబాద్‌లో జరిగి రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ తెలిపారు.

కెమికల్స్ చేతిపై పడి కార్మికుడికి గాయాలు



గాయాలతో కార్మికుడు


హత్నూర, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా కెమికల్స్ చేతిపై పడి కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో జరిగింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సమీర్ గత కొంత కాలంగా గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలంట్ లాబరేటరీ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారి మాదిరిగానే శనివారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో చేతిపై కెమికల్ పడగా.. తాత్కాలిక చికిత్స చేసి వదిలేశారు. చేతిపై బుగ్గల పొడిచి వాపు వచ్చినప్పటికీ కాంట్రాక్టర్ కానీ.. పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి చికిత్స చేయించలేదు. పరిశ్రమ యాజమాన్యం, కాంట్రాక్టర్ స్పందించి ఇప్పటికైనా అవసరమైన వైద్య చికిత్సలు చేయించాలని బాధితుడు కోరుతున్నాడు.

పొలానికి దారి ఇవ్వలేదని.. ఇంటికి పిలిపించి రైతుపై దాడి


దాడితో ఎడమ చేతికి తగిలిన దెబ్బలను చూపుతున్న రైతు మల్లెపల్లి కృష్ణ


కంది, మే 4 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి దారి ఇవ్వలేదని ఓ వ్యక్తి ఇంటికి పిలిపించి రైతుపై దాడిచేసిన ఘటన కందిలో ఆదివారం నిరసనలకు దారి తీసింది. బాధితుడి వివరాల ప్రకారం.. కందికి చెందిన సునీల్‌దేశ్‌ముఖ్ అదే గ్రామానికి రైతు మల్లెపల్లి కృష్ణను పొలం విషయం మాట్లాడాలని గురువారం తన ఇంటికి పిలిచాడు. తన పొలానికి దారి ఎందుకివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సునీల్ దేశ్‌ముఖ్ కృష్ణను తిడుతూ, అతడిపై దాడికి పాల్పడ్డాడు. కృష్ణకు గాయాలు కాగా, శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కృష్ణ ఈ విషయాన్ని దళిత సంఘ నాయకుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు బూడిదకుమార్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆదివారం కృష్ణతో కలిసి కంది అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి సునీల్ ఇంటికి వెళ్లి బైఠాయించారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇక్కడే టెంట్ వేసుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎట్టకేలకు దిగివచ్చిన పోలీసులు కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమింపజేశారు.















సిద్దిపేట మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతులు



వర్షార్పణం

సిద్దిపేట జిల్లాలోని ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయ్యింది. వరదలో ధాన్యం కొట్టుకుపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడి తిరిగి కుప్పగా పోశారు. మార్కెట్ యార్డులు, కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం నీటిపాలైంది. మామిడికాయలు నేల రాలాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి.

-న్యూస్ నెట్‌వర్క్, మే 4 (ఆంధ్రజ్యోతి)



నేలరాలిన మామిడి కాయలు



దౌల్తాబాద్ : గాజులపల్లి లో ఈదురు గాలికి విరిగిన 150 ఏళ్ల చింత చెట్టు



తొగుటలో ఆటోపై కూలిన చెట్టు









వరద నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి దామోదర్ రాజనర్సింహ



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో ఆదివారం పర్యటించిన ఆయనను టీయూడబ్ల్యూజే నాయకులు కలిసి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య పథకం కొన్ని సంవత్సరాలుగా అమలు కావడంలేదన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులకు సరైన వైద్యమందేలా చొరవచూపాలన్నారు. ఆరోగ్య పథకాన్ని కేవలం నిమ్స్‌లో అమలు చేయడంతో చాలామంది జర్నలిసుట్లకు సరైన వైద్యం అందడం లేదని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మాట్లాడుతూ రెండు వారల్లోగా జర్నలిసులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్టులు కృష్ణ, శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధిక్, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, దయాల్, ఆరీఫ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

న్యాయ విద్యార్థికి బంగారు పతకం



నూరీన్ ఫాతిమా

జహీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌కు చెందిన న్యాయవిద్యార్థి నూరీఫాతిమా ఆదివారం బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని వివిధ లా కళాశాలలకు చెందిన విద్యార్థులకు సుల్తాన్ ఉల్‌ము కళాశాలలో గత మూడు రోజులుగా హార్మనీ అండ్ డిస్ప్యూట్ అనే అంశంపై పోటీ పరీక్షలను నిర్వహించారు. ఇందులో జహీరాబాద్‌కు చెందిన న్యాయ విద్యార్థి నూరీఫాతిమా ప్రతిభను కనబర్చడంతో ఆదివారం హైదరాబాద్‌లో ఆమెకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నాగేశ్వరరావు బంగారు పతకాన్ని అందజేశారు.



'నీట్' సందడి

ఉమ్మడి జిల్లాలో ఆదివారం నీట్ ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడి కనిపించింది. చివరి నిమిషంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు పరుగులు తీయడం కనిపించింది. ప్రతి విద్యార్థి నుంచి రెండు పాస్‌సైజ్ ఫోటోలను తీసుకొని, ఒరిజినల్ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. విద్యార్థులు ధరించిన ఆభరణాలు తీసివేయించారు.









ఓవర్ లోడ్ లారీ కార్లపై బోల్తా

● నుజ్జునుజ్జయిన రెండు కార్లు ● ఇద్దరికి స్వల్ప గాయాలు
● మానవత్వం చాటిన మాజీ మంత్రి హరీశ్‌రావు

కొండాపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) : కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ రెండు కార్లపై బోల్తా పడగా కార్లు నుజ్జునుజ్జయ్యాయి. కొండాపూర్ ఎస్‌ఐ భరత్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం హైదరాబద్ నుంచి జహీరాబాద్ వైపు కట్టెల లోడ్‌తో వేగంగా వెళ్తున్న ఓలారీ ప్రమాదవశాత్తు పక్కనే వెళ్తున్న రెండు కార్లపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని కట్టె మొదులు, తుంగలతో సహా కార్లపై పడడం కార్లు నుజ్జునుజ్జుగా మరాయి. అదృష్టం కొద్ది కార్లలో ప్రయాణిస్తున్న వ్యక్తులు సకాలంలో స్పందించి కార్లలో నుంచి బయటకు దిగిపోవడంతో స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డారు. కార్లలో ప్రయాణిస్తున్న వ్యక్తులు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపూర్ చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు కాగా మరో కారులో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య అరుణకు స్వల్ప గాయాలుకాగా, ఇద్దరు కుమారులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కాగా అదే సమయంలో జహీరాబాద్ పర్యటనకు అటుగా వెళ్లన్న మాజీ మంత్రి హరీశ్‌రావు మానవత్వం చాటారు. కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు లాగి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



కార్లపై పడిన లారీ

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

● న్యాయం చేయాలంటూ గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు, గ్రామస్తులు



అశోక్ మృతదేహం

మాసాయిపేట, మే 4(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన మాసాయిపేటలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన తెల్లారి అశోక్ (30) జీఎంఆర్‌లో రోజు వారీ కూలిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు జాతీయ రహదారిపై కూలి పనికి తోటి కార్మికులతో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మాసాయిపేటలోని 44వ జాతీయ రహదారి బంగారమ్మ ఆలయం ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం అతడిని వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది చూసిన తోటి కార్మికులకు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు అక్కడి చేరుకుని గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ తోటి కార్మికులు, గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీఎంఆర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్ రెడ్డి, నార్సింగి, రామాయంపే, తూప్రాన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు వచ్చి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు

రేకులు వేస్తుండగా కింద పడి..



మృతిచెందిన నాగరాజు

చేగుంట, మే 4(ఆంధ్రజ్యోతి) ఇంటి పైకప్పుపై రేకులు వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం వడియారం గ్రామంలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూని నాగరాజు(34) చేగుంట మండల కేంద్రంలో ఓ ఇంటి నిర్మాణంలో భాగంగా పైకప్పు రేకులు వేయడానికి కూలికి వచ్చాడు. రేకులు వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

హార్వెస్టర్ కింద పడి బాలుడు..

● యజమాని ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చేగుంట మే 4 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన మాలే లావణ్య, రాజు తమ ఇద్దరు కుమారులతో కలిసి ఏప్రిల్ 30న తమ మేనమామ వివాహం కోసం ఇబ్రహీంపూర్ గ్రామానికి వచ్చారు. ఆదివారం వారి చిన్న కుమారుడు హర్షిత్(8) ఇంటి ఎదుట ఆడుకుంటుండగా వరి కోత మిషన్(హార్వెస్టర్) డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీయడంతో బాలుడు దాని కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన హర్షిత్‌ను ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు హార్వెస్టర్ యజమాని బెస్త అశోక్ ఇంటి ఎదుట బాలుడి మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టగా గ్రామ పెద్దలో సముదాయించారు. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

వడ్ల కుప్పలను ఢీ కొని వ్యక్తి..

హవేళిఘణపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) : వడ్ల కుప్పలను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గాజిరెడ్డిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం నడిమితండా గ్రామానికి చెందిన గుగులోతు రమేష్(40) దంపతులు ఆదివారం బైక్ పై మెదక్ వచ్చి తిరిగి తమ గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గాజిరెడ్డిపల్లి శివారులో రోడ్డు పక్కన ఉన్న వడ్ల కుప్పను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టు కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..



సిద్దమ్మ మృతదేహం

న్యాల్‌కల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాదంతో మహిళ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం హుస్సేన్‌నగర్‌కు చెందిన సిద్ధమ్మ(55) ఆదివారం ఉదయం ఇంటి ముందు ఉన్న బాతురూంలోకి వెళ్లి బయటకు వస్తుండగా పక్కనే ఉన్న ఇనుపరాడ్డును పట్టుకున్నది. ఆ రాడ్డుకు అప్పటికే విద్యుత్ వైరు అనుకుని ఉండడంతో షాక్ తగిలి తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను చికిత్సనిమిత్తం బీదర్‌కు తీసుకెవెళ్తుండగా మార్యమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వడగామ సంజీవ్ ఫిర్యాధు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు

జహీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ మీదుగ గుల్బర్గకు వెళ్తున్న క్రమంలో పలువురు కార్యకర్తలు ఆయనను జహీరాబాద్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో సీపీఐని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీకి సంబంధించిన సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్‌జలాలోద్దీన్, నాయకులు నర్సింలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాకు చెందిన శ్రీలేఖకు వైద్యం కోసం మంజూరైన రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధితురాలి కుటుంబసభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కిషన్, గణపతి, జైపాల్, ధన్ సింగ్ పాల్గొన్నారు.

ఆలయానికి మకర తోరణం వితరణ

జిన్నారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం జంగంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయాని చౌదరిగూడెం గ్రామానికి చెందిన మద్దూరి మాధవి, మల్లారెడ్డి దంపతులు, ఇతర కుటుంబసభ్యులు గర్భగుడిలోకి మకర తోరణాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన పూజారి శ్రీనివాస భార్గవ వారిని సన్మానించారు.

నేటి నుంచి పాలీసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నారాయణఖేడ్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల పరిధిలో జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సౌజన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్యతలకు సంబంధించిన శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణతో పాటు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు కళాశాల లేదా 9505504211 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాగల్‌గిద్ద, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశించేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు నేటి న ఉంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సువర్ణ ఆదివారం తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

మునిపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో 25 రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో పెద్దలోడి, హస్నాబాద్ టీంలు తలపడగా పెద్దలోడి విన్నర్‌గా నిలిచింది. విజేతలకు గ్రామ పెద్దలు విజయ్ కుమార్, అశోక్ హాజరై విన్నర్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతి అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

శివ్వంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాంబండ గ్రామంలో దాతల సహకారంతో దళితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని దాతలు మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, దళితులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శివ్వంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన నాయిని యాదమ్మ ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి శుభకార్యం నిమిత్తం వెళ్లింది. కాగా సాయంత్రం గుర్తు తెలియని దుండగులు పెంకుటిల్లు పైనుంచి ఇంట్లోకి దిగి బీరువాను ధ్వంసం చేసి, రెండు తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.9 వేల నగదును అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

సిద్ధేశ్వరాలయంలో కోటి రుద్రసూక్త పారాయణం

మెదక్, మే 4 (ఆంధ్రజ్యోతి) : హవేళీఘణపూర్ మండలం ముత్తాయికోటలోని సిద్ధేశ్వరాలయంలో ఆదివారం కోటిరుద్రసూక్త పారాయణం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, పద్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

రాజ్యాంగంతోనే ఉపాధి అవకాశాలు

- 'జైబాబు-జైభీమ్' యాత్రలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మే4 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సదాశివపేట మండలం సూరారంలో నిర్వహించిన 'జైబాపు-జైభీమ్' యాత్రలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ.ముగ్దుం పటేల్, కాంగ్రెస్ నాయకులు రాజుగౌడ్, మచ్చేందర్, టేకూరి రాజు, బేగరి శ్రీను, బేగరి పవన్, బేగరి నవీన్, కలీంపటేల్, అప్సర్, భాసిదు తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట మండలం సూరారంలో నిర్వహించిన 'జైబాపు-జైభీమ్' యాత్రలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా

- వట్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ కొప్పుల లక్ష్మీశేషారెడ్డి


చిల్వర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీశేషారెడ్డి

అల్లాదుర్గం, మే 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వట్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ కొప్పుల లక్ష్మీశేషారెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ మార్క్‌ఫెడ్, సొసైటీ ఆధ్వర్యంలో అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ శేరి దుర్గారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జొన్నలకు ప్రభుత్వం రూ.3,371 మద్దతు ధర అందిస్తుందని, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలను విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి శివగౌడ్, సొసైటీ డైరెక్టర్లు ప్రేమ్‌కుమార్, చెన్నప్ప, నాయకులు శశిధర్‌రెడ్డి, సుభాని, యాదగిరి పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..!

- అసంపూర్తి పనులతో ఆరోగ్య భవనం
- నిరుపయోగంగా చేపల మార్కెట్
- ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు వేడుకోలు


ప్రారంభానికి నోచుకోని నూతన ఆరోగ్య భవనం

జిన్నారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారంలో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభానికి నోచుకోకపోగా.. రెండేళ్ల క్రితం ప్రారంభమైన చేపల మార్కెట్ నిరుపయోగంగా మారింది. రూ.1.56 కోట్లతో పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనం ఆరునెలల కిందటే పూర్తయ్యాయి. బాత్‌రూమ్, టైల్స్ సహా చిన్న చిన్న పనుల కోసం రూ.15 లక్షల వరకు నిధులు అవసరం ఉన్నాయి. నిధుల కోసం పీఆర్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా మంజూరీ కాకపోవటంతో కొత్త భవనం ప్రారంభానికి నోచుకోవటం లేదు. పాత భవనంలో సరైన వసతులు లేవు. వర్షాకాలంలో కొన్నిచోట్ల స్లాబు నుంచి నీరు కారడంతో ఆరోగ్య సిబ్బంది, వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.


నిరుపయోగంగా చేపల మార్కెట్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

జిన్నారం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో రూ.10 లక్షలు వెచ్చించి రెండేళ్ల క్రితం చేపల మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో చేపల మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అధికారులు, పాలకులు భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నక్కవాగును పీల్చేస్తున్నారు

5వ పేజీ తరువాయి

తవ్వుతూ ఇసుకాసురులు తమకు అనుకూలంగా ప్రవాహాన్ని మార్చుస్తున్నారు. నక్కవాగుపై నుంచి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు వెళ్లడానికి నిబంధనలకు విరుద్ధంగా రహదారి నిర్మించారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ బావులను తలపించేలా నక్కవాగు పరిసరాల్లో భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇసుక కోసం మట్టిని పెద్దఎత్తున తోడేయడంతో ఈ గుంతలు ఏర్పడ్డాయి.

కలెక్టర్, ఎస్పీలే దిక్కు..

నక్కవాగును విధ్వంసం కాకుండా కలెక్టర్ క్రాంతి వల్లూరు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ పరితోశ్ పంకజ్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే పారిశ్రామిక వ్యర్థ జలాలతో నక్కవాగును నాశనం చేస్తుండగా.. ఇసుక ఫిల్టర్లతో భౌగోళిక స్థితినే అతలాకుతలం చేస్తున్నారు. గతంలో ఉన్న ఎస్పీతోపాటు పలువురు అధికారులు ఈ నక్కవాగు పరిసరాల్లో ఉన్న ఇసుక ఫిల్టర్ స్థావరాలపై దాడులు చేశారు. అయినా, ఇసుకాసురులు ఒకట్రెండు రోజులకే మళ్లీ వాటిని ప్రారంభించారు. ఈసారి పకడ్బందీ ప్రణాళికతో కలెక్టర్, ఎస్పీలు నక్కవాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీంతో జలవనరులను రక్షించడమే గాకుండా నాసిరకం ఇసుకతో అమాయకులు మోసపోకుండా చూసినట్లవుతుంది. లేదంటే గోదారి ఇసుక పేరిట ఈ నాసిరకం ఇసుకను భారీగా విక్రయించి దగా చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం: ఎంపీ


దుర్గాభవానీమాతను దర్శించుకుంటున్న ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ ఎంపీ బీబీపాటిల్


అమ్మవారిని దర్శించుకుంటున్న హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్

కోహీర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రానున్నరోజుల్లో గ్రామాల, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పేర్కొన్నారు. కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న దుర్గాభవానీమాత జాతరలో ఎంపీ, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ, గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. అలాగే ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కూడా జాతరలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ డిపోకు త్వరలో పది కొత్త బస్సులు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


బోరంచ ఆలయం వద్ద బస్సును ప్రారంభించిన జహీరాబాద్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు త్వరలో మరో పది కొత్త బస్సులు రానున్నాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం బోరంచ పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఖేడ్ నుంచి కంకోల్ వరకు నడపనున్న బస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడునెలల్లో డిపోకు 18 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో మరో పది రానున్నాయని చెప్పారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కొత్త బస్సులను కేటాయించాలని కోరడంతో, త్వరలోనే మరో పది బస్సులు ఇచ్చేందుకు హామీ ఇచ్చారన్నారు. నారాయణఖేడ్ నుంచి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అన్ని రూట్లలో బస్సులను నడపాలని డీఎం మల్లేశయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. కరస్‌గుత్తి నుంచి డోవూర్, మనూర్ మీదుగా సికింద్రాబాద్‌కు బస్సు నడపాలని, జహీరాబాద్, బీదర్ రూట్లో బస్సులు నడపడమే కాకుండా జహీరాబాద్ నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలన్నారు. కంగ్టి, తడ్కల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, బోరంచ ఆలయ కమిటీ చైర్మన్ బెల్లాపురం మల్లన్న, డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ అధికారి పాండు తదితరులు పాల్గొన్నారు. అలాగే బోరంచ ఎమ్మెల్యే ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలు, విద్యా వ్యాప్తికి 'ఆస్క్' ఆదర్శం

రామచంద్రాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు, విద్యా వ్యాప్తికి అమృత సత్తయ్య కొల్లూరి (ఆస్క్) ఎడ్యుకేషనల్ సొసైటీని ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ బీచ్ వాలీబాల్ కెప్టెన్ కృష్ణంరాజు, ఏసీపీ గంగాధర్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ అన్నారు. ఆస్క్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ ఓపెన్ టూ ఆల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. చిన్న వయస్సులోనే మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. మొదటిరోజు(ఆదివారం) వాలీబాల్‌లో మొత్తం 19 జట్లు పోటీ పడ్డాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొల్లూరి అమృతమ్మ, మాజీ కౌన్సిలర్ భరత్‌కుమార్, నాయకులు కుమార్‌గౌడ్, కృష్ణ, నిర్వాహకులు వివేక్, ప్రశాంత్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో కాలనీల్లో అభివృద్ధి : ఎమ్మెల్యే

రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీలోని నిర్మించిన పార్కును కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. వివాదాస్పదంగా ఉన్న స్థలాన్ని పరిష్కరించి పార్కుకు కేటాయింపులు జరిపేటట్లు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతరం రూ.55 లక్షలు నిధులు మంజూరయ్యేట్లు చర్యలు తీసుకున్నామని వివరించారు. అనంతరం తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామంలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరమేష్‌యాదవ్, ఐలేష్, ప్రమోద్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, ఉపకమిషనర్ సురేష్, నరేందర్ పాల్గొన్నారు. మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో మున్నూరుకాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, నాయకుడు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని, అధ్యక్షుడు నాయికోటి బోజయ్యను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సఫాన్‌దేవ్, శంకర్‌యాదవ్, మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్

ఈద్గాను కూల్చివేసిన గుర్తు తెలియని దుండగులు

- పరిశీలించిన ఎంఐఎం నేతలు

మునిపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులో ఇటీవల నిర్మించిన ఈద్గాను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చేశారు. విషయం తెలుసుకున్న ఎంఐఎం పార్టీ హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ఖాద్రి, జిల్లా అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్, మల్లేపల్లి కార్పొరేటర్ జాఫర్‌ఖాన్ ఆదివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈద్గాను కూల్చివేసిన వారిని పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ముస్లింములు ఉన్నారు.

సూర్య తాపం.. వరుణుడి ప్రతాపం

5వ పేజీ తరువాయి

అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరులో, జిన్నారం మండలంలోని జిన్నారం, వావిలాల, కిష్టయ్యపల్లి, గడ్డపోతారం, లక్ష్మీపతిగూడెం తదితర గ్రామాల్లో జోరుగా రాళ్ల వాన కురిసింది. ఆయా గ్రామాల్లో రోడ్లు, నివాసాల ముంగిట తెల్లటి మంచు గడ్డలతో నిండిపోయాయి. ఖేడ్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఒకవైపు ఎండ, మరోవైపు వర్షం కురిసింది.

గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఉమ్మడి జిల్లాలో ఆదివారం పలు గ్రామాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలో చిట్యాల, పోతిరెడ్డిపేట, రేబర్తి, బెజ్జంకి, కోహెడ, సముద్రాల, రాఘవపూర్ గ్రామాల్లో 43 డిగ్రీలకుపైగా, సిద్దిపేట హస్నాబాద్, నంగనూరు, హబ్షీపూర్, శనిగరం, నారాయణరావుపేట్, దూల్మిట్ట, తుక్కాపూర్, బేగంపేట్‌లో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలో శంకరంపేట(ఏ), నర్సాపూర్, నాగపూర్, వడ్డీ, చేగుట, చిట్కుల్, శివ్వంపేటలో 43 డిగ్రీలకుపైగా, కొత్తపేట్, కౌడిపల్లి, పాతూర్, సర్ధన, పొడిచన్‌పల్లి, కొల్చారం, మాసాయిపేట్, మెదక్‌లో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో నిజాంపేట గ్రామంలో గరిష్ఠంగా 42.3 డిగ్రీలు నమోదు కాగా, ముక్తాపూర్, కడ్పల్, సిర్గాపూర్, నాగల్‌గిద్ద, జిన్నారంలో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మున్సిపాలిటీలో తాగునీటికి అధిక ప్రాధాన్యం


బోర్ వేసేందుకు పూజలు నిర్వహించిన నర్సారెడ్డి

తూప్రాన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నరసారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తూప్రాన్ పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు బోరుకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. పట్టణంలో తాగునీటి అవసరాలు తీర్చడానికి బోర్లు వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లర్ల రవీందర్‌గుప్తా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, నాయకులు మామిండ్ల కృష్ణ, కొడిపాక నారాయణగుప్తా, సొసైటీ వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, ఉమర్, బుక్క విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

అల్లాదుర్గం, మే 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు ఆరాధ్యదైవంగా కొలిచే సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని అల్లాదుర్గం మండలం గొల్లకుంట గిరిజనతండాలో నిర్మించారు. ఇందులో భాగంగా ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రముఖ పురోహితులు ప్రవీణ్‌శర్మ పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, దక్షిణ మధ్య రైల్వే జోన్ కమిటీ సభ్యుడు డీ.కాశీనాథ్, ఫుడ్ కార్పొరేషన్ సంస్థ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, మాజీ ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు పాల్గొని పూజలు చేశారు.

అపూర్వం.. విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మెదక్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో 1995లో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబోధన చేసిన కేరళ రాష్ట్ర గురువులను సన్మానించారు.

కార్యకర్తలే పార్టీకి ఆయువు పట్టు


కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే కాంగ్రెస్‌కు పట్టుగొమ్మలని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా అబ్జర్వర్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, దయాకర్, మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డితో కలిసి సమావేశంలో నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు.

'భగీరథ'తో ప్రజల దాహార్తిని తీర్చిన ప్రభుత్వం


సంగారెడ్డి కలెక్టరేట్‌లో భగీరథ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్


ఖేడ్‌లో భగీరథుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సగరులు

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్/అల్లాదుర్గం/కంగ్టి/ మే 4 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి నీటిని సరఫరా చేసి ప్రభుత్వం ప్రజల దాహార్తిని తీర్చిందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. భగీరథ జయంతి సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి జగదీష్, కలెక్టరేట్ ఏవో ఆంటోని, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య నగర ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు నర్సు.పండరి, నర్సు.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అల్లాదుర్గంలో సగర సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ఉప్పరి సాయికుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద భగీరథ జయంతి నిర్వహించారు. మండల కేంద్రమైన కంగ్టిలోని తహసీల్దార్ కార్యాలయంలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం మండలాధ్యక్షుడు మారుతి, తదితరులు పాల్గొన్నారు.